

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2025కు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు అందజేయాలని కోరారు. ఈ నెల 13వ తేదీతో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగియనున్న నేపథ్యంలో జిల్లాలో ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రగతి పథంలో జిల్లా

అన్ని రంగాల్లో గణనీయంగా అభివృద్ధి



కలెక్టర్ విజయకృష్ణన్

- రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న పారిశ్రామిక వేత్తలు
- పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు
- పక్కాగా పి-4 అమలుకు చర్యలు
- విజిటబుల్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- అచ్యుతాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రి త్వరలో అందుబాటులోకి..
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ విజయకృష్ణన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, ఏడాది కాలంలోనే జిల్లాలో ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఏడాదిలో జిల్లాలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం గర్వకారణమన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజన్-2047, పి-4 లక్ష్య సాధనకు ముందుకు సాగుతామన్నారు. కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం వివిధ రంగాల్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, భవిష్యత్ జిల్లా అభివృద్ధి ప్రణాళికను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఎలా ఉంది?

కలెక్టర్: ఏడాది కాలంలోనే ప్రముఖ దిగ్గజ కంపెనీలు జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఇంధన, ఉక్కు, ఔషధ రంగాల్లో ప్రముఖ కంపెనీలు రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. అనకాపల్లి మండలం కోడూరులో సుమారు 40 ఎకరాల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఫార్మా రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు కానున్నది. అచ్యుతాపురం మండలం పూడిమడకలో 1,600 ఎకరాల్లో రూ.లక్షా 85 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్రాజెక్టుకు, నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సెజ్‌లో సుమారు 2,200 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. నక్కపల్లి ఏపీఐఐసీ సెజ్‌లో ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా కలిసి జాయింట్ వెంచర్‌గా సుమారు రూ.లక్షా 47 వేల కోట్ల భారీ పెట్టుబడులతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. అచ్యుతాపురం, రాంబిల్లి ఫార్మా సెజ్‌లో అనేక ఔషధ తయారీ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రశ్న: పారిశ్రామిక పార్కుల పురోగతి ఏమిటి?

జవాబు: జిల్లాలో ఆరు ... మిగతా 8వ పేజీలో



బొత్స కార్యాలయం బయట వేచి వున్న జడ్పీటీసీ సభ్యులు

జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

- నిధుల కేటాయింపులో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని సొంత పార్టీ సభ్యుల ఆరోపణ
- కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోరని మరికొందరి ఫిర్యాదు
- బుజ్జగించిన నేతలు
- బొత్స కార్యాలయంలో పంచాయితీ
- అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌కు ప్రస్తుతానికి నో
- అందరినీ జగన్ వద్దకు తీసుకువెళతానన్న సత్తిబాబు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు, స్వపక్షానికి చెందిన జడ్పీటీసీ సభ్యులకు మధ్య తలెత్తిన విభేదాలపై శుక్రవారం బీచ్‌రోడ్డులో గల వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కార్యాలయంలో పంచాయితీ జరిగింది. ఈ సమావేశానికి అరకులోయ, పాడేరు ఎమ్మెల్యేలు రేగా మత్స్యలింగం, కిముడు విశ్వేశ్వరరాజు, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, కంబాల జోగులు, అదీప్‌రాజ్, జడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తీరుపై అత్యధిక జడ్పీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనికి సంబంధించి అందిన వివరాలిలా ఉన్నాయి.

సమావేశంలో తొలుత జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలను నాయకులు తెలుసుకున్నారు. దాదాపు సభ్యులంతా చైర్‌పర్సన్ వ్యవహారశైలిని తప్పుబడుతూ మాట్లాడారు. జడ్పీ ... మిగతా 8వ పేజీలో

బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహం

- జిల్లాలో 2 వేల హెక్టార్లలో సాగు లక్ష్యం
- రాయితీపై పరికరాలు అందజేత
- ఉద్యాన పంటల సాగుపై రైతుల ఆసక్తి



సబ్బవరం మండలం నల్లరేగులపాలెంలో తుంపర సేద్యం పరికరాల వినియోగం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

బిందు, తుంపర సేద్యానికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. రైతులకు 90 శాతం రాయితీపై పరికరాలు అందిస్తోంది. దీనిపై రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు.



బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బీ అగ్రహారంలో బిందు సేద్యం పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తక్కువ నీటి వినియోగంతో సాగు పెట్టుబడి వ్యయం తగ్గించుకొని, నాణ్యమైన అధిక పంటల దిగుబడులు సాధించగలిగే బిందు, తుంపర సేద్యాన్ని 2014-19 మధ్య అధికారంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీలు అందించి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిందు, తుంపర సేద్యం చేసే రైతులను నిర్లక్ష్యం చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిందు, తుంపర సేద్యాన్ని మరింతగా విస్తరించాలని నిర్ణయించింది. దీంతో రైతులు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏటా కేవలం 8 వందలు నుంచి 9 వందల హెక్టార్ల మధ్యలోనే బిందు, తుంపర సేద్యం జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 2025-26 సంవత్సరంలో రూ.16.32 కోట్ల అంచనా వ్యయంతో ఏకంగా 2 వేల హెక్టార్లలో సాగు చేసేందుకు జిల్లా సూక్ష్మ నీటి సాగు పథకం అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో రాయితీపై వ్యవసాయ, ఉద్యాన పంటలకు బిందు, తుంపర సేద్యం పరికరాలను రైతులకు అందజేయనున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు జిల్లాలో 1,581 మంది రైతులు 1,606.29 హెక్టార్లకు రాయితీ పరికరాలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలో సాధారణంగా రైతులు సాగు చేసే ఉద్యాన పంటలైన మామిడి, కొబ్బరి, చెరకు, బొప్పాయి, అరటి, జామ, దానిమ్మ, వంకాయ, టమాటా వంటి కూరగాయల పంటలకు బిందు సేద్యం రాయితీ పరికరాలు అందజేయనున్నారు. ఈ ఏడాది జిల్లాలో కూరగాయల పంటల సాగు చేసే రైతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లాలో అనకాపల్లి, రావికమతం, సబ్బవరం, కోటవురట్ల, నక్కపల్లి, గొలుగొండ, దేవరాపల్లి, కె.కోటపాడు, పరవాడ మండలాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉన్నందున ఆయా మండలాలతో పాటు మిగిలిన మండలాల్లోనూ బిందు, తుంపర సేద్యం పరికరాలు రైతులకు రాయితీపై అందించేందుకు ఏపీఎంఐపీ జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరికరాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఆరు మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు అనుమతులు జారీ చేసింది. ఆయా కంపెనీల ... మిగతా 8వ పేజీలో

యాంత్రీకరణతో ఎంతో మేలు

యువతను వ్యవసాయం వైపు మళ్లించేందుకు, కూలీల కొరతను నివారించేందుకు ఇదొక్కటే మార్గం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- యంత్ర పరికరాల ప్రదర్శన ప్రారంభం

నర్సీపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): యువతను వ్యవసాయం వైపు మళ్లించడానికి, కూలీల కొరత తగ్గించడానికి యాంత్రీకరణ ఏకైక మార్గమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన యాంత్రీకరణ మేళాను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు ప్రారంభించారు. అనంతరం స్టాల్స్‌లో వరి కోత, దుక్కుదున్నె వ్యవసాయ యంత్ర పనిముట్లు, ట్రాక్టర్లును సందర్శించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయం చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. నేటి యువతరాన్ని వ్యవసాయం వైపు మళ్లించడానికి యాంత్రీకరణ ఒక్కటే మార్గమన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక యంత్రాలను ఉపయోగించుకొని వ్యవసాయం చేయాలని పిలుపునిచ్చారు. కిసాన్ డ్రోన్ పథకంలో వ్యవసాయంలో ఉపయోగించే డ్రోన్ రూ.8 లక్షలు ప్రభుత్వ రాయితీతో అందిస్తున్నామని తెలిపారు. యువత ఇటువంటి పనిముట్లు తీసుకొని స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. కూలీల కొరత అధిగమించడానికి, వ్యవసాయం ఖర్చు తగ్గించుకోవడానికి ఇటువంటి యంత్ర పనిముట్లు ఉపయోగపడతాయన్నారు. తాండవ, రావణాపల్లి రిజర్వాయర్లకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి శీతల గిడ్డంగిని ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే సంవత్సరానికి వ్యవసాయరంగంలో నర్సీపట్నం నియోజకవర్గం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టాలని సూచించారు. యాంత్రీకరణకు ప్రభుత్వం రాయితీగా ఇచ్చిన రూ.2.51 కోట్లు చెక్కు నమూనాలు అందజేశారు. మినీ ట్రాక్టర్‌ను స్పీకర్ నడిపి దాని పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఐదు ఎకరాలలో అరటి, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న గైరంపేటకి చెందిన యువ రైతు ... మిగతా 8వ పేజీలో



వ్యవసాయ యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

వైసీపీ ఎలమంచిలి అసెంబ్లీ సమన్వయకర్తగా ధర్మశ్రీ



కరణం ధర్మశ్రీ

అనకాపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కరణం ధర్మశ్రీ నియమితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఎలమంచిలి సమన్వయకర్తగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజును ఆ పదవి నుంచి తప్పించి కరణం ధర్మశ్రీని నియమించారు. అయితే కన్నబాబురాజుకు పార్టీలో ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు. కన్నబాబురాజు సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత నుంచి వయో భారంతో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల తాడేపల్లిలో జరిగిన ఎలమంచిలి నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కన్నబాబురాజు పార్టీ అధ్యక్షుడితో తనకు వయోభారం పెరుగుతున్నందున కరణం ధర్మశ్రీకి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని కోరినట్టు సమాచారం. ఎలమంచిలి సమన్వయకర్త పదవిని ఎలమంచిలి ఎంపీపీ బి.గోవింద్, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు ఆశించినప్పటికీ సామాజిక సమీకరణల నేపథ్యంలో ధర్మశ్రీని సమన్వయకర్తగా నియమించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



టోల్‌ప్లాజా కౌంటర్ల వైపు దూసుకుపోయిన లారీ (ఇన్‌సెట్‌లో) లారీ ముందు భాగం

టోల్‌ప్లాజాపైకి దూసుకువెళ్లిన లారీ

- తప్పిన పెనుప్రమాదం

నక్కపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం పెనుప్రమాదం తప్పింది. విశాఖ నుంచి కాకినాడ వెళుతున్న లారీ అదుపుతప్పి అతి వేగంగా వేంపాడు హైవే టోల్‌ప్లాజా కౌంటర్లను ఢీకొట్టింది. డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు చెప్పారు. టోల్‌ప్లాజా ఒకటో నంబరు కౌంటర్ నుంచి దూసుకెళ్లి, రెండవ కౌంటర్‌ను ఢీకొని ఆగిపోయింది. లారీ చక్రాలు ఊడిపోయాయి. టోల్‌ప్లాజా సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. టోల్‌ప్లాజా 1, 2 కౌంటర్లకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

సామరస్యంగా కేసులను సత్వరం పరిష్కరించుకోవాలి

▸ ఎలమంచిలి కోర్టుల నాయమూర్తులు విజయ, స్పందన, రమేష్


న్యాయ అంశాలతో కూడిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ


కరపత్రాలను కక్షిదారుకు అందజేస్తున్న జడ్జి స్పందన

ఎలమంచిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : న్యాయస్థానాల్లో ఉన్న కేసులను మధ్యవర్తుల సహకారంతో సత్వరమే పరిష్కరించుకోవాలని న్యాయమూర్తులు సూచిం చారు. ఎలమంచిలి లోని కోర్టుల సముదాయాల్లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.విజయ, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్పందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులో దాఖలయ్యే సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి సుదీర్ఘ కాలం పోరాడే కంటే, ఇరువర్గాలు సామరస్య వాతావరణంలో వ్యవహరిస్తే ఆయా కేసులు త్వరితగతిన పరిష్కారం కాగలవన్నారు. కేసులు పరిష్కరించుకునేందుకు వీలుగా మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు ధూళి నూకరాజు, ఎల్‌వీ రామకృష్ణారావు, శ్రీనివాస పట్నాయక్ లను నియమించినట్టు చెప్పారు. అనంతరం న్యాయ అంశాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్య క్షుడు టి.సత్యానారాయణ, కార్యదర్శి ఎల్‌వీ రామకృష్ణారావు, డి.వెంకటరావులతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కొక్కిరాపల్లిని మునిసిపాలిటీ నుంచి విభజించండి

▸ చైర్‌పర్సన్, కమిషనర్‌లకు కౌన్సిలర్ రామకృష్ణ వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ

ఎలమంచిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో విలీనం చేసిన తమ కొక్కిరాపల్లి వార్డును వేరుచేసి, గ్రామ పంచాయతీగా స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ ఆయా గ్రామస్థుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ శుక్రవారం మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజుకు అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 12 సంవత్సరాల క్రితం మేజర్ పంచాయతీగా ఉన్న కొక్కిరాపల్లి పంచాయతీతో పాటు మరో ఆరు గ్రామాలను విలీనం చేసి మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం 23వ వార్డుగా ఉన్న కొక్కిరాపల్లి అన్ని విధాలా వెనుకబడి ఉందని వాపోయారు. కనీస సదుపాయాలు లేక గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ వార్డులో 90 శాతం మంది ప్రజలు వ్యవసాయం, కర్షక, కార్మికులేనని వివరించారు. మునిసిపాలిటీలో విలీనం చేసిన తరువాత ఉపాధి పనులు లేకుండా పోయాయన్నారు. తమ వార్డును మునిసిపాలిటీ నుంచి విభజించి గ్రామ పంచాయతీగా స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని కోరుతూ జనవాణి కార్యక్రమంలో కూడా వినతి పత్రం అందజేశామన్నారు.ఈ సమస్యలపై చైర్‌పర్సన్, కమిషనర్ వెంటనే స్పందించాల్సిందిగా ఆయన కోరారు.

జనం మెచ్చేలా కూటమి పాలన

▸ ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ▸ టీడీపీ నేతలు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు


15వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం అద్వితీయ పాలన అందించి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల మన్ననలు అందుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మునిసిపాలిటీలోని 15వ వార్డులో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా తాతయ్యబాబు, ప్రగడ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, పరిశీలకుడు బొండా జగన్నాథం, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ తదితరులు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన జరుగుతోందని తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరావు అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అప్పుల గుప్పగా మారిందని ఎద్దేవా చేశారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి, నాయకులు బొద్దపు శ్రీను, దాడి రమేష్, కర్రెడ్ల మల్లికార్జున, భీశెట్టి చిన్నారావు, యల్లపు గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 19 మందికి మంజూరైన టీడీపీ రిలీఫ్ ఫండ్ చెక్కులను తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడారి మంజు, రాజాన సూర్య నాగేశ్వరరావు నాలుగు మండలాలకు చెందిన టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

దొప్పెర్ల గ్రామంలో...

అచ్యుతాపురం : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్ అన్నారు. దొప్పెర్లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పతివాడ చిన్నం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మామిడి శివ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు కొల్లి వెంకటరావు, కొల్లి వరహాలరావు, ముచ్చు గంగరాజు, కోలా నగేశ్, బండి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ రాంబిల్లి మండల శాఖ అధ్యక్షుడు లాలం భరత్ అన్నారు. మండలంలోని కొత్తపేట, చిన కలవలాపల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలశాఖ మాజీ అధ్యక్షుడు వి.దినేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆదిరెడ్డి, నాయకులు లాలం అభిరామ్, అజయ్, పప్పల బాబూరావు, వై.నారాయణరెడ్డి, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

▸ కేజీబీవీల్లో నూతన భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుందరపు


హైస్కూల్ ఆవరణలో నిర్మాణం చేసిన కేజీబీవీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయకుమార్ దృశ్యం


రాంబిల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మరింత నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండల కేంద్రం రాంబిల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని, కొండల దేవునిపాలెంలోని కేజీబీవీలో అదనపు తరగతుల గదులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కేజీబీవీల్లో విద్యనభ్యసించే బాలికలు ఎందరో మంచి స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌక ర్యాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఉపా ధ్యాయులు చెప్పిన పాఠాలను చక్కగా విని మంచి ఫలితాలు సాధించాల్సిందిగా విద్యార్థినులకు సూచించారు. అనరంతరం ఆయా ఆవరణల్లో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఎంపీడీవో జయమాధవి, ఎంఈవో ఎం.సూర్యారావు, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ప్రమీల, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్, మాజీ అధ్యక్షుడు వి.దినేష్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, వైస్ ఎంపీపీ కె.నర్సింగరావు, నాయకులు కశిరెడ్డి ప్రసాద్, బద్ది మహేష్, అల్లవరపు బాబ్జి, శ్రీనివాసరావు, అప్పలరాజు, చినబాబు, ఆనంద్, బలరాం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నబాబు రాజు జన్మదిన వేడుకలు


అచ్యుతాపురంలో కేక్ కట్‌చేసి పంచుకుంటున్న నాయకులు

అచ్యుతాపురం/రాంబిల్లి/ మునగపాక, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జన్మదిన వేడుకలను శుక్రవారం అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోన బుజ్జి, లాలం రాము, మారిశెట్టి వెంకట రమణ, శనివాడ జువ్వాల నాయుడు, వియ్యపు కృష్ణ, గంగూళీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పి.కిషోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు. నాయకులు నెట్టెం సత్యనారాయణ, ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, ధూళి వెంకి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మునగపాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోటస్వామి సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకరణలో భగీరథీ అమ్మవారు



అచ్యుతాపురం రూరల్, జూలై 11, (ఆంధ్రజ్యోతి) : మండంలోని హరిపాలెం శివారు అందలాపల్లి కొండపై కొలువుదీరిన భగీరథీ అమ్మవారు శుక్రవారం శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం వేడుకల్లో భాగంగా వేకువజామున అర్చకులు అమ్మవారిని వివిధ రకాల కూరగాలు, ఆకు కూరలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొరపూడి టీడీపీ అధ్యక్షుడిగా యశ్వంత్



రాంబిల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గొరపూడి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా అప్పన్నపాలెం గ్రామానికి చెందిన లెక్కల యశ్వంత్ నియామకమయ్యారు. చిన్నవయస్కుడైనప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుడడంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకు వెళుతున్నారు. ఇదిగుర్తించిన పార్టీ అధిష్ఠానం ఈ మేరకు ఆయనకు పదవి కట్టబెట్టింది.

హరిపాలెం నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

అచ్యుతాపురం రూరల్, జూలై 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రేడ్-1 పంచాయతీ అయిన హరిపాలెంలో రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోతున్న వారికి పరిహారం ప్రత్యేకంగా ఇప్పించాలని పలువురు నిర్వాసితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో పలువురు మాట్లాడుతూ అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోతున్న భవనాలు,నిర్మాణాలకు నష్టపరిహారం మునగపాక మేజర్ పంచాయతీకి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేకంగా ఇస్తున్నారన్నారు. అదే ప్యాకేజీ మేజర్ పంచాయతీ హరిపాలెనికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు.


శ్రీరాంపురం వైజంక్షన్ వద్ద చెక్ గేటును పరిశీలిస్తున్న ఎస్పీ

యువత మత్తుకు బానిస కాకుండా నిఘా

▸ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

దేవరాపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసలు కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్, శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా గుర్తింపు తేవడానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. యువత మత్తు వైపు మరలకుండా విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం జరుగుతుందని తెలిస్తే.. వెంటనే 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఐదు వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటి వరకు 2,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్‌అండ్‌.బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి రోడ్లపై పడిన గుంతల్ని పూడ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేవరాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు హత్య కేసులకు చార్జిషీట్లు దాఖలు చేయాలని సీఐ పైడపునాయుడును, ఎస్ఐ మల్లేశ్వరరావులను ఆదేశించారు.

రైతుల అభివృద్ధికి కృషిచేయాలి

▸ టీడీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్

▸ పీఏసీఎస్‌ల నూతన చైర్‌పర్సన్లకు సత్కారం


పీఏసీఎస్ చైర్‌పర్సన్లను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల అభివృద్ధికి కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నూతనంగా నియమితులైన చైర్‌పర్సన్లను సత్కరించారు. పాయకరావుపేట, శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్ పర్సన్లుగా నియమితులైన దేవవరపు రాజబాబు, చిక్కాల శ్రీనివాసరావులను టీడీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్, పార్టీ నాయకుడు యాళ్ల వరహాలబాబు తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లకు నూతనంగా నియమితులైన పాలకవర్గాలు మండలంలో రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పెంకే గోవిందు, పార్టీ నాయకులు రాజాన ఆది, వెంకటసూరి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులు ఎప్పుడొచ్చేనో..?

▸ బదిలీ జరిగినా పాత పాఠశాలల్లోనే టీచర్లు

▸ పలు పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల కొరత

▸ డీఎస్సీ అభ్యర్థులు వచ్చేవరకూ తప్పని సమస్య


ఉపాధ్యాయుల కొరత ఉన్న కోటవురట్ల ఉన్నత పాఠశాల

కోటవురట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు కావడంతో కొత్త వారి రాక కోసం పాఠశాలల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఈ ఏడాది పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల బదిలీ చేపట్టింది. దరఖాస్తు చేసుకొని తాము కోరుకున్న స్థానాల్లో కొలువుల సంపాదించారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా చాలా మంది బదిలీ అయినా పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఖాళీ అయిన స్థానాల్లో మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో, ఉన్నవారు రిలీవ్ కావడం లేదు. ఈ సమస్యతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఏర్పడుతోంది.

మండలంలో కొడవటిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ, గణితం, సోషల్ పోస్టుల కొరత ఉంది. అలాగే కె.వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్, గణితం, హిందీ పోస్టులు, కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గణితం, ఎన్ఎస్, హిందీ, తెలుగు పోస్టులు, పాములవాక జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ, సోషల్, గణితం పోస్టులు, రామచంద్రపురం పాఠశాలలో గణితం పోస్టు, బోడపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం పోస్టుల కొరత ఉంది. అలాగే కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీ పోస్టు భర్తీ కావాల్సి ఉంది. పోస్టుల కొరత కారణంగా కొందరు ఉపాధ్యాయులు బదిలీ జరిగినప్పటికీ, ఇంకా పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారు. దీంతో కోరుకున్న స్థానానికి వెళ్లలేక వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షలకు సంబంధించి త్వరలోనే ఫలితాలు ప్రకటించి పోస్టింగ్ ఇవ్వడానికి ప్రభుత్వ సన్నాహాలు చేస్తోంది. దీంతో డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకూ బదిలీ జరిగినప్పటికీ ప్రస్తుతం పనిచేస్తున్న వారు పాత స్థానాల్లోనే కొనసాగే అవకాశం ఉన్నట్టు విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. వారి రాకకోసం ఈ స్థితిలో బదిలీ ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు. ఏదేమైనా విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గ్రామీణుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యం

▸ ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

▸ 328 లబ్ధిదారులకు రూ.5.53 కోట్ల రుణాల చెక్కులు పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

ఎస్.రాయవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నదే లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉమ్మడి జిల్లా చైర్మన్ కోనా తాతారావు అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ బ్యాంకుల అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా బ్యాంకును రూ.3 వేల కోట్ల టర్నవర్‌కు పెంచేలా పాలకపక్షం, సిబ్బంది పనిచేస్తున్నట్టు చెప్పారు. రైతులు ఏ పంట వేసినా రుణం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నష్టాల బాటలో ఉన్న సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయడంతో పాటు డీసీసీబీని రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ బ్యాంకుగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గం పరిధిలోని రైతులు, డ్వాక్రా సంఘాలకు చెందిన 328 మంది లబ్ధిదారులకు రూ.5.53 కోట్లకు చెందిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డీవీఎస్.వర్మ, జిల్లా సహకార అధికారిణి స్వరూప, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు, గుర్రం రామకృష్ణ, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, బ్రాంచి బీఎంలు, పీఏసీఎస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి చర్యలు


గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు మహేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావుతో కలిసి గ్రీవెన్స్ వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌కి మండలానికి సంబంధించి వచ్చిన అర్జీలను పూర్తిగా పరిశీలించి, ఆయా శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్వోలు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్. రాయవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు ఫీడర్లతో పాటు ఎస్.రాయవరం సెక్షన్‌లోని పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, నక్కపల్లి మండలంలోని పెద బోదిగళ్లం, రామకృష్ణపురం, పెదదొడ్డిగొల్లు, సీతంపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు అమలాపురంలో హోం మంత్రి అనిత పర్యటన

నక్కపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామంలో శనివారం ఉదయం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటిస్తారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 గంటలకే ఆమె అమలాపురం చేరుకుంటారు. మహిళలు, గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడతారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి వివరిస్తారు. ఇందుకు సంబంధించికూటమి నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శివారు గ్రామాల్లో పారిశుధ్య పనులు

▸ ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో వున్న శివారు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నామని ఎంపీడీవో డి.సీతారామరాజు చెప్పారు. శుక్రవారం దేవవరం శివారు ఒడ్డిమెట్ట గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించడంపై ఆయన ఆరా తీశారు. తాగునీటి పథకాల ట్యాంకుల క్లోరినేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సూచించారు. ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇదే సమయంలో సంపద కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని ఎంపీడీవో సూచించారు.

కోటవురట్ల పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారణం

కోటవురట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పీఏసీఎస్ అధ్యక్షుడిగా నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే వేచలపు శ్రీరామూర్తి కుమారుడు జనార్దన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తొలిసారిగా తెలుగుదేశం పార్టీ తరపున వేచలపు జనార్దన్‌ను సొసైటీ అధ్యక్షుడిగా కూటమి ప్రభుత్వం నియమించగా, పాలకవర్గ సభ్యులు సుంకర నూకినాయుడు, చిటికెల సత్యనారాయణతో కలిసి ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షుడు జనార్దన్ చెప్పారు. అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేస్తానన్నారు. నూతన పాలకవర్గ చైర్మన్, సభ్యులను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, పి.సూర్యరావు, జానకి హరిబాబు తదితరులు అభినందించారు.


కోటవురట్ల నూతన పాలకవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న కాశీనాయుడు, లింగంనాయుడు

గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి : జడ్పీ సీఈవో


మొగలిపురంలో సంద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తి అన్నారు. మండలంలోని మొగలిపురంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు, మురుగు కాలువల నిర్వహణ, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ మిషన్ పనులు, సంపద కేంద్రం తదితరాలను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించి అభివృద్ధి, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ డి. చైతన్య, కార్యదర్శి రజినీ, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, సత్యనారాయణ, మేడపాటి రాము, గండి నరేష్, బైలపూడి పోతునాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో కలశాలతో పూజలు


కలశాలతో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ హోమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ మం డపంలో 1001 లోకోత్తర కలశాలు, 108 అష్టోత్తర కలశాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, గురుపూజోత్సవం సందర్భంగా గురువారం రాత్రి దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులను ఘనంగా సత్కరించారు.

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు : జడ్సీ చక్రవర్తి


కూరగాయల మార్కెట్ వద్ద వ్యాపారులకు సూచనలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని చూసి చిల్లర వర్తకులకు హెచ్చరికలను జారీ చేశారు. చెత్తా చెదారాన్ని డస్ట్ బిన్‌లలో వేయాలే తప్ప రోడ్లపై వేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇకపై ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాలన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. సత్యనారాయణ థియేటర్ సమీపంలోని బాలకృష్ణ బస్టాప్‌ను పరిశీలించారు. లోపల చెత్తా చెదారం ఉండడం, ప్రయాణికులు రోడ్డుపై నిలబడి ఉండడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్‌షెల్టర్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇదిలావుంటే, 82వ వార్డు పరిధి విజయరామరాజుపేటలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల నివారణకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ రవి, మలేరియా ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కోదండరామ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పాక పైడితల్లమ్మ పండుగ పోస్టర్ ఆవిష్కరణ


పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాంకీ తదితరులు

కొత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కొప్పాకలో పైడితల్లి అమ్మవారి పండుగ ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను అనకాపల్లి రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) శుక్రవారం ఆవిష్కరించారు. ఈ వేడకను అంతా విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం : స్పెషల్ ఆఫీసర్

కశింకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారమే మండల సమన్వయ కమిటీ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీ సుభాషిణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. పలువురి నుంచి సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కార మార్గాలను అధికారులకు వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వి.వి. రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ రమేష్, ఎస్ఐ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

‘బీమా పాలసీపై జీఎస్టీని తొలగించాలి’

కొత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాలసీదారులు కడుతున్న పాలసీపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం అనకాపల్లిలో బ్రాంచ్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏజెంట్ల గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ ట్రెజరర్ త్రిమూర్తులు, యూనియన్ రూరల్ జిల్లా అధ్యక్షుడు రమణబాబు, సహాయ కార్యదర్శి ఈశ్వరరావు, గొర్లి శంకరరావు, కరణం మాణిక్యాలరావు, అప్పారావు, ఐతా రాము తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది కేంద్రీయ విద్యాలయం

» ఎంపీ సీఎం రమేష్ సహకారంతో ఏర్పాటు ప్రక్రియ పూర్తి » అనకాపల్లి మండల సమావేశంలో పీలా గోవింద వెల్లడి » సమస్యలను సభ దృష్టికి తెచ్చిన పలువురు సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా

తుమ్మపాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయాన్ని అనకాపల్లి మండలం సుందరయ్యపేటలో ఏర్పాటు చేయడం తథ్యమని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వెల్లడించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎంపీ సీఎం రమేష్ సహకారంతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. రానున్న విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఏఎంఏఎల్ కళాశాలలో తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయం ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. సుందరయ్యపేటలో శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టి అక్కడకు తరలిస్తామన్నారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించడం జరుగుతుందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ తుమ్మపాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, వివిధ పాఠశాలల విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ఆట స్థలం ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూనియర్ కళాశాలకు ఎనిమిది కిలోమీటర్ల పైబడి దూరం ఉంటేనే తప్ప మరో కళాశాల మంజూరు చేయడం కుదరదని చెప్పారు. ఇప్పటికే అనకాపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో ఉందని, విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలను సూచించారు. అలాగే ఆట స్థలానికి సంబంధించి తుమ్మపాలలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో సమస్య ఉందని చెప్పారు. వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్లు తగ్గాయని, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కొత్తూరు సర్పంచ్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో భవన నిర్మాణాలు సగంలో నిలిచిపోయాయని, వాటిని పూర్తిచేయాలని కోరారు. పాఠశాలలు, మౌలిక సదుపాయాలు తదితరాలకు సంబంధించిన నివేదికను సిద్ధం చేసి అందించాలని ఎంఈవో కోటేశ్వరరావుకు పీలా గోవింద సూచించారు. నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సహకారంతో పూర్తి చేయనున్నామన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం వ్యవహారంలో వ్యవసాయాధికారులపై మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రైతులందరికీ ఈ పథకం వర్తిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కోత విధించిందని ఆరోపించారు. దీనిపై మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి సమాధానమిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పథకం వర్తింపజేస్తున్నామన్నారు. తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కూటమి అర్హులైన రైతులకు న్యాయం చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఇన్‌చార్జి తహసీల్దార్ కె. కుమారస్వామి, ఎంపీడీవో పిఆశాజ్యోతిలతో పాటు వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట’


వెంకుపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న బుద్ద


జీవీఎంసీ 81వ వార్డు రామునాయుడు కాలనీలో...

కొత్తూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం పర్యటించి మాట్లాడారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తుంటే జగన్‌రెడ్డి, అతని బృందం అబద్ధ ప్రచారం చేస్తుందని, వీటి ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు శరగడం నాగేశ్వరరావు, పొలమరశెట్టి సూరిబాబు, ఆడారి నారాయణరావు, కొయిలాడ జగదీశ్వరరావు, పి.వి.అప్పలస్వామినాయుడు, ఆడారి ఆనంద్, గణేష్, కన్నంనాయుడు, గిరినాయుడు, సత్యనారాయణ, రాము, శివనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం రాత్రి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ నిర్వహించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కూండ్రం గ్రామంలో ముగ్గురికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు కేకేవీఏ నారాయణరావు, పోలిన సూరిజగ్గారావు, రొంగలి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, పల్లెల నాగేశ్వరరావు, సేనాపతి స్వరూప పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. జీవీఎంసీ 81వ వార్డు రామునాయుడు కాలనీలో శుక్రవారం సుపరిపాలన ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. నియోజకవర్గ పరిశీలకుడు గంటా నూకరాజు, పద్మశాలి సంఘం డైరెక్టర్ దాసరి శ్రీనివాసు, వేదుల సూర్యప్రభ, జామి రాజు, యండకుర్తి అప్పలరాజు, భానుచందర్ పాల్గొన్నారు.

పరవాడ : కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్టు టీడీపీ సీనియర్ నేత, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ముత్యాలమ్మపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కొవిరి ముత్యాలు, మత్స్యకార నాయకులు అర్జిల్లి అప్పారావు, కృష్ణ, అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

88వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం


వెదుళ్లనరవలో శిలాఫలకం ఆవిష్కరణలో మేయర్ శ్రీనివాసరావు, పంచకర్ల

సబ్బవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో గల వెదుళ్లనరవ ఎన్టీఆర్ కాలనీ, శివాలయం కాలనీ, కొత్తూరు బీసీ కాలనీ, ఇందిరానగర్, రాణీనగర్, కొత్తూరు నాగరాజు తోట, గంగవరం, కుంచువానిపాలెం, ముత్యమాంబ కాలనీ తదితరాల్లో శుక్రవారం సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, డ్రైన్‌ల నిర్మాణ పనులకు విశాఖ నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా ఆగడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనరంజక పాలన అందిస్తున్నట్టు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు మరో రెండు నెలల్లో పరిపూర్ణంగా అమల్లోకి రానున్నాయన్నారు. జోనల్ కమిషనర్ శేషాద్రి, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, కూటమి నాయకులు ఇందల రమణ, గంతకోరు శివకుమార్, ఉరుకూటి శ్రీను, మాడిస నర్సింగరావు, రాజాన పైడిరాజు, వబ్బిన శ్రీకాంత్, గవర సత్యం, చట్టి రాము, సారిపల్లి యన్నాజీ, చొప్పా కనకరాజు, నక్క ప్రసాద్, గొర్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అనర్థాలు

» ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు,



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులతో కలిసి వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పొగాకు వినియోగం వల్ల జరిగే అనర్థాన్ని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, డీఎల్‌ఏపీవో డాక్టర్ బాలాజీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాణి తదితరులు వివరించారు. వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు డాక్టర్ డీడీ నాయుడు, తాడి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలి

» ప్రపంచ జనాభా దినోత్సవంలో వైద్యుల సూచన


ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా కారణంగా ప్రసూతి ఆరోగ్యం, కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమస్యలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, మాతృ ఆరోగ్య సేవలకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ రవిచంద్రదేవ్, డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ ఎస్తేరు రాణి, రామచంద్రరావు, ఎస్. రమణ, బేగం తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో...

తుమ్మపాల : ఇక్కడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోసిబ్బంది ర్యాలీని నిర్వహించి ప్రణాళికబద్ధమైన మాతృత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ తల్లి కావడానికి సరైన వయసు, శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరమన్నారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారు తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది బి.మంగమ్మ, ఎం.మరియమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : మండల కేంద్రమైన కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ యశోద పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లి కావడానికి సరైన వయస్సు శరీరం, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : జనాభా నియంత్రణ పాటించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు డాక్టర్ జయశ్రీ కర్మిషా, డాక్టర్ హారిక అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా పెరిగిపోవడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ సాయిరాం, సిబ్బంది జానకీరామన్, ప్రసాద్‌కుమార్, పీవీ రత్నం, చైతన్య, విజయకుమారి, అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం అని ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక జనాభా వలన ప్రపంచంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎం.గోవిందరావు, బి.లక్ష్మి, డాక్టర్ ఎల్. గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లికి చేరిన రెజెంగ్లా పవిత్ర కలశ యాత్ర


అనకాపల్లిలో మహేశ్వరి యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జరుగుతున్న రెజెంగ్లా పవిత్ర కలశ యాత్ర శుక్రవారం అనకాపల్లికి చేరుకుంది. గాంధీనగరం నుంచి నెహ్రూచౌక్ వరకు నిర్వాహకులు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షురాలు ఎస్.మహేశ్వరి యాదవ్, సెక్రటరీ జనరల్ డి. ఆంజనేయమూర్తి, నడ్డి నాగమల్లేశ్వరి, కలశ యాత్ర కన్వీనర్ బంకా దత్తాత్రేయ యాదవ్, ఉత్తరాంధ్ర ఇన్ చార్జి పల్లా రాజేశ్వరరావుయాదవ్, బోయిన భానుమూర్తియాదవ్, రామలింగేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఒరిగిన గడ్డర్

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఐరన్ గడ్డర్ ఒరిగిపోయింది. పట్టాల వద్ద ఉన్న సీ-చానల్ సైడ్ గడ్డర్ ప్రమాదకరంగా మారి గడ్డర్ ఊడిపోయి పక్కకు ఒరిగిపోయింది. ఈ సమస్యను స్థానికులు గుర్తించి జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ దృష్టికి గురువారం రాత్రి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు రైల్వే అధికారులను అప్రమత్తం చేశారు. రైల్వే అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. జనసేన నాయకులు ఆళ్ల రామచంద్రరావు, భర్నికాన రాము రాత్రి అంతా దగ్గరుండి పరిస్థితిని సమీక్షించి అధికారులకు సహకారం అందించారు. దీంతో ప్రమాదం తప్పింది.

12 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని శుక్రవారం రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేశారు. మరో బాలుడిని అదుపులోకి తీసుకుని జువెనైల్ హోంకు తరలించారు. వీరి నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మహారాష్ట్రకు చెందిన విశాల్ రమేశ్ వాగ్‌మేర్, లక్కీ సర్బిర్‌సింగ్‌తో పాటు మరో బాలుడు ఆంధ్రా -ఒడిశా సరిహద్దులో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వస్తున్నారు. గూడ్స్‌షెడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి వారి బ్యాగ్‌లు తనిఖీ చేయగా 12 కిలోల గంజాయి బయటపడింది. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి, బాలుడిని జువెనైల్ హోంకు తరలించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

కశింకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటానని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. కశింకోటలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త దేవర అయ్యప్ప కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5లక్షల చెక్కును బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావుతో కలిసి అందజేశారు. అలాగే, కొందరికి సీఎం సహాయని నిధి చెక్కులను అందించారు. టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, దాసరి బాబు, తాకాశి కృష్ణ, వేగి వెంకట్రావు, పంచదార్ల సూరిబాబు, వేగి పాపారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

'మీ కోసం'లో 128 వినతుల స్వీకరణ

పాడేరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 128 వినతులందాయి. జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, మంత్రులు సమక్షంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్. లోకేశ్వరరావు అర్జీలను స్వీకరించారు. హుకుంపేట మండలం, బూర్జ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి, జాకరవలస నుంచి సొంటరిపాడుకు రోడ్డు నిర్మించాలని కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పిట్టలపాడులో 70 కుటుంబాలు, 40 మంది పిల్లలున్నారని, ఈస్థితిలోగ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని స్థానికులు మర్రి చంటిబాబు, ఎస్.ముత్యాలమ్మ తదితరులు కోరారు. జీకేవీధి మండలం వంచుల పంచాయతీకి చెందిన ఆర్‌కే రాజు గ్రామంలో అంగన్ వాడీ భవనం నిర్మించామని, మూడో విడత బిల్లులు చెల్లించాలని తదితర వినతులు అందించారు.కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్దనరావు, జిల్లా ట్రెజరీ అధికారి ఆర్.ప్రసాదరావు, జిల్లా ఉద్యాన అధికారి ఎ. రమేశ్‌కుమార్‌రావు, సచివాలయాల నోడల్ అధికారి పీఎస్‌కుమార్, చిన్ననీటి పారుదలశాఖ డీఈఈ ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఐటీడీఏ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

గంజాయి రవాణా నిరోధమే లక్ష్యం: సీఐ

▸ కిరండూల్ - విశాఖపట్నం పాసింజర్ రైలులో తనిఖీలు

అరకులోయ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా నిరోధమే లక్ష్యంగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని స్థానిక సీఐ హిమగిరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అరకు రైల్వేస్టేషన్‌లో కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళ్లే పాసింజర్ రైలులో సీఐ, ఎస్ఐ. గోపాలరావు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. గత వారంలో నేరుగానే ఎస్పీ అమిత్ బర్ధార్‌తో పాటు పాడేరు డివిజన్ పోలీస్ యంత్రాంగం ఈ రైలులో చేపట్టిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాలపై శుక్రవారం తిరిగి తనిఖీలు చేపట్టారు. డాగ్‌స్కాడ్ అన్ని బోగీలతో పాటు ప్లాట్‌ఫాంలో పాసింజర్ల లగేజీ బ్యాగులను సైతం తనిఖీలు చేపట్టారు. ఒడిశాలోని కొరాపుట్, మల్కన్‌గిరి ప్రాంతంనుంచి విశాఖకు గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంపై ఈ తనిఖీలు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు. అనుమానితుల సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అరకు స్టేషన్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్కాడ్ తదితరులు పాల్గొన్నారు.


స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను డాగ్‌స్కాడ్‌తో తనఖీలు చేస్తున్న దృశ్యం

హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు

▸ వంటా- వార్పుతో గిరిజనుల నిరసన


అడ్డాకుల్లో భోజనంతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకోట పంచాయతీ తముటు, కొండిభకోట, రేగుళ్లపాలెం గ్రామాల గిరిజనులు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆయా గ్రామాల గిరిజనులు శుక్రవారం వంటా-వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తంచేశారు. అడ్డాకుల్లో భోజనం పట్టుకుని, రోడ్డుపై ఆందోళన చేపట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే తమకు ఉపాధి పోతోందని అన్నారు. భూములు, నీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ స్థితిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేసే వరకు పోరాటం విరమించేది లేదని హెచ్చరించారు.

గరిమండలో సమస్యలపై వినతి


స్పందనలో వినతి ఇస్తున్న తిరుపతిరావు, తదితరులు

కొయ్యూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ళ పంచాయతీ గరిమండలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పాడేరులో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రమందించినట్టు గ్రామానికి చెందిన కొర్ర తిరుపతి, మేడ లక్ష్మి, తదితరులు తెలిపారు. ప్రధానంగా గరిమండ-కన్నవరం మధ్య అసంపూర్తిగా నిలిచిన రహదారి నిర్మాణ పనులు తక్షణం పూర్తి చేయాలని, ఈదురు గాలులు ప్రభావంతో శిథిలమైన గొర్రెలమెట్ట ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల పైకప్పు రేకులును మరమ్మతులు చేయించాలని కోరామన్నారు. గ్రామాల్లో సీహెచ్ డబ్ల్యులుగా పనిచేస్తున్న వారిని ఆశ కార్యకర్తలుగా ప్రమోట్ చేయాలని ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. స్పందించిన అధికారులు పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టుగా తెలిపారు.

అనారోగ్యంతో బాలింత మృతి


మృతి చెందిన గర్భిణీ కావ్య

కొయ్యూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట పంచాయ తీ జాజుబందకు చెందిన బాలింత అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలింత మర్రి కావ్య (25) రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భర్త కామేశ్వరరావు ఆ మెను మండల కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించి గ్రామానికి తీసుకువెళ్లారు. గురువారం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. రాత్రివేళ తిరిగి ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు గ్రామంను సరైన రహదారిలేదు. దీంతో ఆమె గురువారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో కావ్య తుది శ్వాస విడిచింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రా మానికి సరైన రహదారిలేదన్నారు. దీంతో వైద్యం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ విభాగం, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడెప్)ల ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషన్, ప్లాస్టిక్ ఎక్స్‌ట్రూషన్ మెటీరియల్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జె. తేజరతన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో 15వ తేదీ ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయానికి హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 20వ తేదీ నుంచి మూడు నెలలు శిక్షణ అందిస్తారన్నారు. ఈ కాలంలో భోజనవసతితో పాటు యూనిఫాం అందిస్తారన్నారు. అనంతరం అభ్యర్థులకు విశాఖలో ఉద్యోగావకాశాలు కల్పించి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 22 వేలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. వివరాలకు ఫోన్: 94925 72737, 79894 80836 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ' అర్జీలకు రేపటి వరకు గడువు

పెదబయలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు దరఖాస్తు గడువు జూలై 13 గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి సునీల్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అర్హుల జాబితాలో పేర్లు లేని రైతులు తక్షణమే తమ ఆధార్, భూమి పట్టాలతో సంబంధిత రైతు సేవా కేంద్రాల వద్ద వెళ్లి వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల ద్వారా ప్రభుత్వానికి గ్రీవెన్స్ పెట్టుకోవాలని ఆయన సూచించారు.

మంత్రుల దృష్టికి విద్యా రంగ సమస్యలు


హోం మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

పాడేరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పాడేరు పర్యటనకు వచ్చి రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిలకు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అంగనైని ఆనంద్, జిల్లా కన్వీనర్ తిరుపల్లి యోగి వినతిపత్రమందించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని, అదనపు తరగతి, వసతి గదులు నిర్మించాలని, జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీలో ఉద్యోగ నియామకాలను గిరిజన అభ్యర్థులతో నే భర్తీ చేయాలని మంత్రిని కోరినట్టు చెప్పారు.పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులనునియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పంతులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.పాడేరు పర్యటకు వచ్చిన ఈ మంత్రులను ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి జిల్లాలో ఉన్న పోస్టు మెట్రిక్ గిరిజన హాస్టల్స్‌లో, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలు, హెల్త్ వర్కర్లను నియమించాలని, కాస్మోటిక్స్ సరఫరా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు వి.కృష్ణ, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం


మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్


మోదకొండమ్మ సన్నిధిలో మంత్రి వంగలపూడి అనిత, పక్కన గిడ్డి ఈశ్వరి

పాడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పాడేరుకు విచ్చేసిన మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణిలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. ఘాట్ మార్గంలో అమ్మవారి పాదాలు వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్‌టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టూరిజం డైరెక్టర్ కేవీ.రమేశ్‌నాయుడు, కాఫీ బోర్డు డైరెక్టర్ కురుసా ఉమామహేశ్వరరావు, జనసేన నేత వంపూరు గంగులయ్య, తదితరులు మంత్రి వంగలపూడి అనితకు కండువాలు వేసి, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ఘాట్‌లో అమ్మవారి పాదాలను మంత్రి అనిత దర్శించుకున్నారు. అక్కడి నుంచి పాడేరు చేరుకున్న ఆమె మోదకొండమ్మను దర్శించుకున్నారు. అలాగే పాడేరు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్, జేసీ అభిషేక్‌గౌడ, డీఎఫ్‌వో పీవీ.సందీప్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, తదితరులు స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

చింతపల్లిలో ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించాలి

▸ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

చింతపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను యథావిధిగా కొనసాగించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఈ కళాశాలను ఎత్తివేస్తున్నట్టు ఉత్తర్వులు వచ్చినట్టు తెలుసుకున్న మాజీ మంత్రి శుక్రవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. స్థానిక ఏడీఆర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ద్వితీయ సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో ఈ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 14ఏళ్లగా రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో విద్యార్థులు ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి తక్షణమే స్పందించి ఈ కళాశాలను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దేపూరి గిరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

కళాశాల కొనసాగింపుపై ప్రభుత్వానికి లేఖ

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు



అనంతగిరి: చింతపల్లిలోని సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలను మూసివేత ప్రతిపాదన విరమించుకోవాలని ఎస్టీకమిషన్ చైర్మన్ డీజీవీ శంకరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనప్రకటన విడుదల చేశారు. గిరిజన విద్యార్థులు ఉపయోగకరంగా ఉన్న ఈ కళా శాల మూసివేయాలని ఆలోచనపై దారుణమన్నారు.బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో ఈస్థితినెలకొంటోందన్నారు.గిరిజన విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కళాశాల కొనసాగించాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్టుగా తెలిపారు.

కళాశాల తరలింపు సరికాదు:

- డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్

సీలేరు: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి అనుబంధంగా ఉన్న సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరడం లేదనే సాకుతో దీనిని రద్దు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన ఈ ప్రాంతంలో ఉన్న ఈ ఒక్క సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మూసివేయడం మేరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంలో పునరాలోచించాలని కోరారు.

ముంచంగిపుట్టులో అంధకారం


శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ముంచంగిపుట్టులో చీకటి

ముంచంగిపుట్టు, జులై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం అంధకారం నెలకొంది. విద్యుత్ శాఖ అధికారులకు ముందుచూపు కొరవడటంతో రోజంతా కరెంట్ లేక జనాలు ఇ బ్బందులు పడాల్సి వచ్చింది. నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వేణుగోపాల్ ప్రకటించారు. ఈ విషయం రెండు రోజులు ముందుగానే తెలియజేయాల్సి ఉంది. అలా అయితే, ఏవైనా పనులుంటే ప్రజలు ముందుగా చక్క దిద్దుకుంటారు. అలాగే, శుక్రవారం విద్యుత్ సరఫరాను ఉదయం 9 గంటలకు నిలిపిన అధికారులు రాత్రి 8 గంటల వరకూ ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో , సచివాలయాల్లో పలు రకాల ఆన్‌లైన్ పనులకు బ్రేక్ పడింది. ఇంటర్ నెట్, జిరాక్స్ షాప్‌లు మూతపడ్డాయి. బ్యాంకుల్లో లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో గ్రామాల నుంచి పిల్లా పాపలతో కాలినడకన వివిధ ఆన్‌లైన్ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగారు. తరచూ మరమ్మతు పనుల పేరుతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'భూ రికార్డుల్లో లోపాలను సరిచేయాలి'


మాట్లాడుతున్న పెసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు

కొయ్యూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వారసత్వ భూములు కలిగిన రైతులకు సంబంధించి మ్యూటేషన్, యాడింగ్ తదితర పనుల్లో లోపాలను సవరించాలని పెసా కమిటీ కార్యదర్శి గోకిరి చిన్నారావు, ఉపాధ్యక్షుడు స్వామినాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. గతంలో డీ పట్టాలు ఇచ్చిన భూములకు సంబంధించి మ్యూటేషన్లు, సర్వే నెంబరు యాడింగ్‌లు లేక వెబ్ ల్యాండులో నమోదు కాక ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తోడు ఒకరి పట్టాకు మరొకరి ఆధార్ నంబరు అను సంధానం కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎక్కువ సాగు భూమి ఉన్నట్టుగా రికార్డులు చూపడంతో ఇన్‌కం ట్యాక్స్ పెయర్‌గా చూపి ప్రభుత్వం ద్వారా అందే రాయితీ పథకాలకు పలువురు అందకుండా పోతున్నాయన్నారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు సరిచేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అధ్యాపక ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం


పాడేరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీకి ఇంటర్ విద్యా కమిషన్ నుంచి ఆదేశాలందినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సొంటేన భీమ శంకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు కలిగి, టీచింగ్ అనుభవం , పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్స్, జేఎల్స్, స్కూల్ అసిస్టెంట్స్, ప్రొఫెసర్స్ ఈ అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలనికోరారు. సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికైన వారికి గంటకు రూ. 150 చొప్పున చెల్లిస్తామన్నారు. ఈ ఎంపికల్లో గతంలో జూనియర్ కళాశాలల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత కల్పిస్తారన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలు, ఇతర వివరాలను ఆయా ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి తెలుసుకోవాలని తెలిపారు.

వ్యవసాయ అధికారికి బదిలీ

చింతపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావుని శ్రీకాకుళం జిల్లా రేగడి ఆమదాలవలస బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీకేవీధిలో పనిచేస్తున్న ఏవో మధుసూదనరావు ఇక్కడ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం శ్రీనివాసరావు రిలీవ్ అయ్యారు. నూతనంగా నియమితులైన వ్యవసాయఅధికారి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

పాడేరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌ఎస్, జిల్లా సెట్విజ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ రసూల్ మాట్లాడుతూ జనాభా దినోత్సవాన్ని ఏటా జూలై 11న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జనాభాతో వచ్చే సమస్యలు, ఇతర అంశాలపై దృష్టిని కేంద్రీకరించేందుకు ఈ దినోత్సవం దోహదపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహపడేలా ఈ రోజను ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, కళాశాల సిబ్బంది, జిల్లా సెట్విజ్ కో-ఆర్డినేటర్ ఎస్‌ఏ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతపల్లి కళాశాల అధ్యాపకురాలు సంతోషి


పాడేరు డిగ్రీ కళాశాలలో వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లు అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చింతపల్లిలో..

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ అధ్యాపకురాలు సంతోషి మాట్లాడుతూ ప్రపంచ జనాభా 2025 నాటికి 8.23బిలియన్లు దాటుతుందని అంచనావేసినట్టు చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనతోపాటూ మాత, శిశు మరణాల నియంత్రణ, కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ పీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

శరత్‌నగర్ సబ్‌సెంటర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు


శరత్‌నగర్ సబ్‌సెంటర్ వద్ద ఆరోగ్య సిబ్బందితో పీహెచ్‌సీ డాక్టర్ నజీబ్

డుంబ్రిగుడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శరత్‌నగర్ సబ్‌సెంటర్‌కు వైద్య సేవలు అందించడంలో జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పీహెచ్‌సీ వైద్యాధికారి నజీబ్ తెలిపారు. కేంద్ర నాణ్యత అంచనా ప్రమాణ బృందం జూన్ 20వ తేదీన కిల్లోగుడ పీహెచ్‌సీ పరిధిలోని శరత్‌నగర్ సబ్‌సెంటర్‌ను సందర్శించిందన్నారు. సిబ్బంది విధి నిర్వహణ, పరిసరాల శుభ్రత, గర్భిణులు, బాలింతలు, నవజాతి శిశు సంరక్షణపై క్షుణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జాతీయ స్థాయిలో శరత్‌నగర్ సబ్‌సెంటర్‌కు 84 శాతం గుర్తింపు వచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినందుకు సిబ్బంది ఆనందం వ్యక్తంచేశారు.

గిరి కైలాస క్షేత్రాన్ని దర్శించిన విభూశ్రీ ఆశ్రమ స్వాములు


ఉమానీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న పరబ్రహ్మశ్రీ మహా విభూశ్రీ ఆశ్రమ స్వాములు

పాడేరురూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి ఆలయాన్ని పరబ్రహ్మ శ్రీమహా విభూశ్రీ ఆశ్రమ స్వాములు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన స్వాములకు ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. ఆలయంలో ఉన్న వివిధ దేవతామూర్తుల దర్శనం అనంతరం వారిని సత్కరించి స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామం పంతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు, సత్యవరపు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్వర బాధితులకు విధిగా రక్త పరీక్షలు

▸ జిల్లా మలేరియా అధికారి తులసి.. లంగ్బాపోదర్‌లో చిన్నారి మృతిపై విచారణ


గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారిణి తులసి

ముంచంగిపుట్టు, జులై 11 (ఆంధ్రజ్యోతి): జ్వర బాధితులకు విధిగా రక్త నిర్ధారణ పరీక్షలు చేయించాలని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి సూచించారు. మండలంలో మారుమూల రంగబయలు పంచాయతీ లంగ్బాపోదర్ గ్రామాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. గ్రామానికి చెందిన కొర్రా రంజిత (6) అనే చిన్నారి మలేరియా జ్వరంతో ఈనెల 8న పాడేరులో చికిత్స పొందుతూ మృతి చెందింది. అలాగే, పలువురు జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆమె ఆ గ్రామన్ని సందర్శించారు. మృతురాలి రంజిత తల్లిదండ్రులు శంకరరావు, బుధోయ్‌లతో ఆమె మాట్లాడారు. చిన్నారి మృతి చెందక ముందు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సుమారు 12 రోజులపాటు జ్వరంతో ఉందని తల్లిదండ్రులు తెలిపారు. అలాగే, ఆమెకు అందిన వైద్య సేవలు, మందుల వివరాలను సేకరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి గిరిజనులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.పలుచోట్ల మురుగునీటి నిల్వలను గ్రామస్థులతో శుభ్రం చేయించారు. పరిసరాలనుశుభ్రంగా ఉంచాలని దోమతెరలను వాడాలని, వ్యాధులు సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. అనంతరంస్థానిక సీహెచ్‌సీలోని లంగ్బాపోదర్‌కు చెందిన జ్వరపీడితులతో ఆమె మాట్లాడారు.వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండోవిడత దోమల మందు పిచికారి

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభించినట్టు స్థానిక మలేరియా సబ్ యూనిట్ అధికారి బుక్కా చిట్టిబాబు తెలిపారు. శుక్రవారం తాజంగి లో జరుగుతున్న ఈ పిచికారీ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మలేరియా కేసులు నమోదైన గిరిజన గ్రామాల్లో తొలి విడత దోమల మందు పిచికారి పూర్తి చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎంటీఎస్ గుమ్మ యుగంధర్, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాల ధ్రువపత్రాలు సమర్పించాలి: ఎస్ఐ


ఎస్ఐ రమణ

పెదబయలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ప్రైవేటు సర్వీసు వాహనాలు కలిగిన వారు తక్షణమే వాటికి సంబంధించి లైసెన్స్ ఇతర ధ్రువపత్రాలు, డ్రైవర్ చిరునామా తదితర వాటిని పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. ఎస్పీ అమిత్ బర్ధార్ ఆదేశాల మేరకు మోటార్ యూనియన్, ఆటో యూనియన్ కార్మికులు వాహనాలకు చెందిన కాపీలను అందించాలన్నారు. వాహనాలపై పోలీస్ కేసులు ఉంటే.. ఆ క్రైమ్ నెంబర్ వివరాలను అందించాలని స్పష్టం చేశారు. గతంలో గంజాయి కేసుల్లో అరెస్టయి జైలు నుంచి విడుదలైన వాహన యజమానులు, డ్రైవర్లు స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


డస్ట్ బిన్ అందిస్తున్న ఎంపీడీవో

డుంబ్రిగుడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉం చుకోవాలని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండలంలోని కించుమండలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడేలో భాగంగా సందర్శించారు. ఈ సం దర్భంగా ఇంటింటికీ డస్ట్ బిన్లు అందించారు. వీధుల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఈ సందర్భంగా గ్రామస్థులు కోరారు.

తూటంగిలో వన మహోత్సవ ర్యాలీ

డుంబ్రిగుడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండంలోని తూటంగి పంచాయతీలో సీపీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్వంస్థ అధికారి నాగమణి మొక్కల వల్ల ప్రయోజనాలకు గిరిజనులకు అవగహన పరిచారు. పంచాయతీ కార్యదర్శి హైమవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జీకే వీధి ఏవో బదిలీ

గూడెంకొత్తవీధి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిని బదిలీ చేస్తూ వ్యవసాయ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న వ్యవసాయ అధికారి మధుసూదనరావును చింతపల్లి బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా నుంచి శారదను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మధుసూదనరావు రిలీవ్ అయ్యారు. నూతన వ్యవసాయ అధికారి శనివారం విధుల్లో చేరనున్నారు.



శ్రీరాంపురం వైజంక్షన్ వద్ద చెక్ గేటును పరిశీలిస్తున్న ఎస్పీ

యువత మత్తుకు బానిస కాకుండా నిఘా

▸▸ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

దేవరాపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసలు కాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్, శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా గుర్తింపు తేవడానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. యువత మత్తు వైపు మరలకుండా విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం జరుగుతుందని తెలిస్తే.. వెంటనే 112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల్లో ఐదు వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటి వరకు 2,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి రోడ్లపై పడిన గుంతల్ని పూడ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. దేవరాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు హత్య కేసులకు చార్జిషీట్లు దాఖలు చేయాలని సీఐ పైడపునాయుడును, ఎస్ఐ మల్లేశ్వరరావులను ఆదేశించారు.

సేవలు మెరుగుపర్చండి: ఎస్పీ తుహిన్‌సిన్హా



సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

కె.కోటపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. శుక్రవారం ఎ.కోడూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రవాణా నివారణకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగితే సమాచారం అందించేలా ప్రజలను చైతన్యపర్చాలని చెప్పారు సీఐ పైడపునాయుడు, ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ

▸▸ డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డెయిరీ డైరెక్టర్ పవన్‌కుమార్

చోడవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు విశాఖ డెయిరీ అండగా నిలుస్తున్నదని, వారికి సంపూర్ణ సహకారం అందిస్తున్నదని డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ చెప్పారు. డెయిరీ ఏరియా కార్యాలయంలో శుక్రవారం పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులకు డీ వార్మింగ్, వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. మేలుజాతి సక్సెస్ సెమెన్ ద్వారా ఆడ పెయ్యిల సంపదను పెంపొందించాలని కోరారు. పాల సేకరణ పెరుగుదల, నాణ్యత గురించి రైతులకు వివరించారు. అంతకు ముందు పాడి రైతులకు డెయిరీ తరఫున మంజూరైన పరిహారం చెక్కులు రూ.9 లక్షలను సభ్య రైతులకు యూనిట్ మేనేజర్ రాము చేతుల మీదుగా అందించారు.

గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు



కుంజుర్తిలో రోగులను వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేఖ, సిబ్బంది

రావికమతం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు కుంజుర్తి, పిడింపాలెం గిరిజన గ్రామాలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సురేఖ, సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 38 మంది అనుమానితులకు ఆర్డీ కిట్లతో పరీక్షలు నిర్వహించగా, ఇద్దరికి పీవీ (ప్లాస్మోడీమ్ వైవాక్స్)గా నిర్ధారణ జరిగినట్టు డాక్టర్ సురేఖ తెలిపారు. మిగిలిన వారికి అవసరమైన మందులను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌వీ రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోవింద, ఎంఎల్ హెచ్‌పీ జోష్ని పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమిత ప్రాంతంలో హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

రోలుగుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేట సర్వే నంబర్‌లో 52/2లో చెరువు గర్భాన్ని ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. క్వారీ యాజమాన్యం చెరువు ఆక్రమించి రహదారిని నిర్మించారని, వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్ నాగమ్మ ఆధ్వర్యంలో ఆర్ఐ రామమూర్తి, రెవెన్యూ సిబ్బంది రోడ్డు నిర్మించిన ప్రాంతం ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు శిక్షార్హులని వారు హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నింజాస్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు

నర్సీపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలకు నింజాస్ అకాడమీ బాక్సింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో శని, ఆదివారాలు జరిగే పోటీలలో టి.జగదీశ్, ఎల్.ధీరాజ్, జి.రాజేశ్, ప్రవీణ్, మోక్షిత, జి.ప్రవీలా, కె.శరణ్య, కె.శర్వాణి పాల్గొంటారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

రహదారిపైనే మురుగు

▸▸ చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

▸▸ వాహన చోదకులు, పాదచారుల ఇక్కట్లు



మెయిన్ రోడ్డులోని పశువుల ఆసుపత్రి సమీపంలో పారుతున్న మురుగు నీరు

చోడవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం చోడవరంలోని మెయిన్ రోడ్డు చెరువును తలపిస్తున్నది. రహదారి మురుగు నీటి నిల్వ కేంద్రంగా మారిపోతున్నది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు, పాదచారులు పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది.

చోడవరం మెయిన్ రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో వర్షం నీటితో పాటు పరిసర దుకాణాల్లోని వాడుక నీరు కూడా రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉంటున్నది. ప్రధానంగా పశు వైద్యశాల సమీపంలోను, ఎస్ఎస్ షాపింగ్ మాల్ వద్ద మురుగు నీరు పేరుకుపోతున్నది. ఇది చెరువులా మారిపోవడంతో రోడ్లపై తిరిగే వారితో పాటు వాహన చోదకులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నుంచి వస్తున్న దుర్వాసనతో జనం ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రహదారిపై మురుగునీరు కాలువల్లోకి మళ్లించే పరిస్థితి లేకపోవడంతో స్థానికులకు, వచ్చీపోయే వారికి ఈ బాధలు తప్పడం లేదు. దీంతో ఇది మెయిన్ రోడ్డా? లేక మురుగునీరు పారే కాలువా? అని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మెయిన్ రోడ్డులో ఈ మురుగునీటి బాధను తప్పించాలని వాహన చోదకులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘాలను అభివృద్ధి చేయండి

▸▸ రైతులకు నేరుగా సేవలు అందించాలి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని దండిసురవరం పీఏసీఎస్‌లకు ప్రభుత్వం పాలకవర్గాలను నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల వద్దకు నేరుగా వెళ్లి సేవలు అందించాలని చెప్పారు. దండిసురవరం సొసైటీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాలకు సొసైటీ కార్యదర్శిని తీసుకొని పాలకవర్గ సభ్యులు రైతుల దగ్గరకు వెళ్లాలని, వారి అవసరాలను గుర్తించి వెనువెంటనే తీర్చాలని సూచించారు. అలాగే పాత రుణాలు కట్టించుకొని కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులు పాడవ్వకుండా ఉండేందుకు 70 శాతం రాయితీపై గోదాములు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి సొసైటీ ద్వారా రుణాలు మంజూరు చేస్తామని రైతులకు వివరించాలన్నారు. సభ్య రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొందేలా చూడాలన్నారు.

అంతకు ముందు దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొబ్బాది తాతారావు, డైరెక్టర్లుగా మడగల సోమునాయుడు, దాలిబోయిన ఫాల్గుణతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు పీళ్ల కోటేశ్వరరావు, గండి ముసలినాయుడు, రెడ్డి రాము, పేరపు కొండబాబు, పైల ముత్యాలునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.84 కోట్లతో పెద్దేరు జలాశయం ఆధునికీకరణ

▸▸ పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జగ్గారావు

మాడుగుల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయం ఆధునికీకరణ పనులకు రూ.84 కోట్లు మంజూరయ్యాయని జలాశయం కమిటీ చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రూ.1.07 కోట్లకు సంబంధించి పనులు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనూహ్యంగా పెద్దేరు ఆధునికీకరణ పనులకు రూ.84 కోట్లు మంజూరు కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రైతులకు సాగు నీటి కష్టాలు తొలగించేందుకు ఎంపీ సీఎం.రమేశ్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కృషి చేస్తున్నారని, వారి కారణంగానే జలాశయానికి రూ.84 కోట్లు వచ్చాయని చెప్పారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మాట్లాడుతూ ఇక్కడి జలాశయం టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైందన్నారు. తర్వాత ప్రభుత్వాలు మారినా పెద్దేరు జలశయం పనులు పూర్తిచేసి రైతుల కష్టాలను తీర్చే పరిస్థితి లేకపోయిందని వాపోయారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రూ.84 కోట్లు మంజూరు చేయడంతో జలాశయం పరిధిలోని పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేరు జలాశయం వైస్ చైర్మన్ అర్లి గోవింద, టీడీపీ మండల కార్యదర్శి ఉండూరు దేముడు, మాడుగుల పట్టణ అధ్యక్షుడు వద్దాది కంజిత్ వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు లెక్కల కాశిబాబు, నాయకుల ఎన్.సన్యాసిరావు, పి.జగన్నాథరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం





నర్సీపట్నంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో వీవీ.రమణ... దేవరాపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నర్సీపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో వైద్యులు, సిబ్బంది ర్యాలీలు చేశారు. నర్సీపట్నంలో ఆర్డీవో వీవీ రమణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన కుటుంబం శ్రేయస్కరమన్నారు. మానసికంగా, శారీరంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మహిళ గర్భం దాల్చాలని చెప్పారు. ప్రస్తుతం యువత జనభా తగ్గుతున్న కారణంగా ప్రతీ ఒక్క దంపతులు సంతాన్ని పొందాలని, తద్వారా ఆరోగ్యకరమైన పైరులను అందివ్వాలని కోరారు.

చోడవరంలో...

చోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, అప్పలనాయుడు, మల్లిబాబు, కృష్ణారావు, రాధాకృష్ణ, జ్యోతి, సంధ్య, వెంకటేశ్, వాసురాజు, కోమల, హేమగణేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దేవరాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అన్ని విధాలా ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే పిల్లలను కనాలని ఈ సందర్భంగా వైద్యాధికారి పూజిత మేఘన అన్నారు. బాల్య వివాహాల వల్ల వచ్చే అనార్థలపై ఆమె అవగాహన కల్పించారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అయ్యన్న విద్యా సంస్థలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పోటీల విజేతలకు యువజన సర్వీస్‌ల కో-ఆర్డినేటర్ ఎస్.ఏ.బాబు, అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం బహుమతులు ప్రదానం చేశారు.

నాతవరంలో...

నాతవరం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.మంగవేణి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శబ్నం మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు వివాహం చేయవద్దని, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం పాటించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కేవీ రమణ, త్రివేణి, బైరాగి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శునకాలను పరుగు పెట్టించిన కొండముచ్చులు





సాయిబాబా గుడి, ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద కుక్కలను ఆట పట్టిస్తున్న కొండముచ్చులు

నర్సీపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోకి చేరిన ఆరు కొండముచ్చులు శుక్రవారం ఉదయం వీధి కుక్కలను ఒక ఆట ఆడుకున్నాయి. శునకాలను రెచ్చగొట్టి పరుగులు పెట్టించాయి. కొండముచ్చులను అందుకోవడానికి గ్రామ సింహాలు... వాటికి దొరికినట్టే దొరికి పరుగు లంకించుకున్న కొండముచ్చులు స్టేడియంలో వాకింగ్ వచ్చిన వారికి వినోదాన్ని పంచాయి. స్టేడియంలో చెట్లు, టంగుటూరి విగ్రహం, ప్రహరీగోడల మీదకు గెంతుతూ పావుగంట సేపు కుక్కలకు చుక్కలు చూపించాయి. శునకాలు అలసిపోయేవరకు ఆటపట్టించాయి. కోతి చేష్టలు అంటే ఇలాగే ఉంటాయని సందర్శకులు నవ్వుకున్నారు.

జి.కొత్తపల్లిలో వర్మీకంపోస్టు విక్రయాలు

చీడికాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కొత్తపల్లి గ్రామ పంచాయతీలోని సంపద తయారీ కేంద్రంలో తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువును విక్రయిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సిరికి రాముకు డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖరరావు చేతులమీదుగా శుక్రవారం అమ్మకాలు చేశారు. కిలో రూ.8 చొప్పున 160 కిలోల వర్మీకంపోస్టును విక్రయించినట్టు డిప్యూటీ ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరినాయుడు, పంచాయతీ కార్యదర్శులు పట్నాల గోపి, పీలా పద్మవతి తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా బకాయిలు వసూలు చేయండి

మాకవరపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నీటి తీరువా బకాయిలను వసూలు చేయాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సాగు నీటి సంఘాల అధ్యక్షులు, వీఆర్‌వోలతో ప్రత్యేక సమావేశంల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు రూ.70 లక్షల నీటితీరువా బకాయిలు ఉండగా, కేవలం రూ.1.5 లక్షలు మాత్రమే వసూలు చేశారన్నారు. ప్రతీ వీఆర్‌వీ నీటితీరువా బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు కూడా నీటి తీరువా బకాయిలు చెల్లించి సాగునీటి వనరులను అభివృద్ధి చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నూకరాజు, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రెండు పీఏసీఎస్‌లకు చైర్మన్ల నియామకం



సాంబమూర్తి (చోద్యం)

గొలుగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు పీఏసీఎస్‌లకు ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. చోద్యం పీఏసీఎస్‌కు చిటికెల సాంబమూర్తి, చీడిగుమ్మల సొసైటీకి కామిరెడ్డి శ్రీరామ్మూర్తిని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ ఈ సొసైటీలకు అధికారులు పర్సన్ ఇన్‌చార్జులుగా వ్యవహరించారు. సొసైటీ రైతులకు పంట రుణాలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని నూతనంగా నియమితులైన చైర్మన్లు తెలిపారు.

పంచాయతీల పురోగతిపై శిక్షణ

రోలుగుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతిపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం పురోగతి సూచిక అనే నూతన కార్యక్రమం చేపట్టిందన్నారు పంచాయతీలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, సాధించాల్సిన లక్ష్యాలపై సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. పంచాయతీల్లో రోజువారీ జరిగే కార్యక్రమాలను ఈ గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి, జూలై11 (ఆంధ్రజ్యోతి) మండలంలో చింతపూడి, తామరబ్బ పంచాయతీల పరిధిలోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులకు భగవాన్ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా 217 గొడుగులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, బొడ్డు సుధాకర్ మౌళి, కెఅప్పలనాయుడు, కొటాన రాంబాబు, ఆదిరెడ్డి చినకన్నబాబు, ఉపాధ్యాయుడు సుబాష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గొలుగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో మేరీరోజీ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పక పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

మాకవరపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన చుక్కల శివ బయ్యవరం, ఎస్‌జీఆర్‌పీ అగ్రహారం గ్రామాల్లోని విద్యార్థులకు వీటిని అందజేశారు. రానున్న రోజుల్లో మరింత సాయం చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో బోర్ల మరమ్మతు

కృష్ణాదేవిపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో చేతి బోర్లను శుక్రవారం మరమ్మతు చేశారు. గ్రామంలో నాలుగు చేతి బోర్లు ఒక్కసారిగా పాడవ్వడంతో ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో బాగు చేశారు. వినాయకవీధి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లోని బోర్లను వినియోగంలోకి తీసుకు వచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి శిక్షణ శిబిరం

చీడికాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమగ్రాభివృద్ధి కోసం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈవో బొంజుబాబు చెప్పారు. తురువోలు ఉన్నత పాఠశాలలో తొమ్మిదిఓ తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అఅవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.రామకృష్ణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు జీపీఏ.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

15న మెగా జాబ్ మేళా

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ నెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ వరకు చదువుకొని 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల యువతీ యువకులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను నైపుణ్యం.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత, సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా జరిగే ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8247505171 ఫోన్ నంబరును సంప్రతించాలని కోరారు.

'బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలి'



జిల్లా అధ్యక్షునిగా భాస్కరరావుకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఎలమంచిలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో అధిక శాతం ఉన్న బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ దాడి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, బీసీ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ రేవు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా ఎలమంచిలి కొత్తపాలేనికి చెందిన ఆడారి భాస్కరరావును నియమిస్తున్నట్టు ప్రకటించారు.

బీఎన్ రోడ్డు దుస్థితిపై మరో కేసు

» అధికారులకు నోటీసులు



గోతులమయంగా ఉన్న చోడవరంలోని బీఎన్ రోడ్డు

చోడవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో కీలకమైన బీ ఎన్ రోడ్డు దుస్థితిపై స్థానిక కోర్టులో మరో కేసు దాఖలైంది. బీఎన్ రోడ్డులో వంతెనలు శిథిలావస్థకు చేరడంతో పాటు రహదారి మొత్తం గోతుల మయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు సమస్యలు ఎదుర్కొంటున్నారని మండల వికలాంగుల సంక్షేమ సంఘం ప్రధాన సలహాదారు డీఎస్ ప్రసాద్ స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ కోర్టులో ఈ నెల 5న కేసు దాఖలు చేశారు. ఈ కేసుకు పీఎల్‌సీ నంబర్ 5/2025ను కేటాయించారు. ఇప్పటికే బీఎన్ రోడ్డుపై స్థానిక న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కేసు దాఖలు చేయగా, మరో న్యాయవాది చీపురుపల్లి సూర్యనారాయణ కూడా విడిగా మరో కేసు దాఖలు చేశారు. ఈ కేసులకు సంబంధించి సంబంధిత అధికారులకు శుక్రవారం నోటీసులు వెళ్లాయని డీఎస్ ప్రసాద్ తెలిపారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై అసంతృప్తి గళం

... 5వ పేజీ తరువాయి

కార్యాలయానికి వచ్చినా తమను పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపించారు. నిధుల కేటాయింపులో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని మరికొందరు ఫిర్యాదుచేశారు. అయితే అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటామని, పార్టీకి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేయబోమని కొంతమంది చెప్పారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకుంటారేమోనని నాలుగైదు నెలలుగా వేచి చూస్తున్నామని, కానీ ఎవరూ కనీసం పట్టించుకోలేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ దశలో ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు జోక్యం చేసుకుని చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఎంతమంది, వ్యతిరేకంగా ఎంతమంది ఉన్నారో తేలాలంటే చేతులెత్తే పద్ధతిని పాటించవచ్చునని, లేనిపక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు సమావేశమై ఒక నిర్ణయానికి రావచ్చునని అన్నారు. దీంతో సభ్యులను బయటకు పంపి నాయకులు చర్చించుకున్నారు. ఆ తరువాత అందరినీ లోపలకు రప్పించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ జడ్పీటీసీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నానని, అధినేత జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అంతవరకూ సంయమనం పాటించాలన్నారు. దీంతో కొందరు సభ్యులు లేచి వారం, పది రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లాలని అడగ్గా...నెల తరువాత తీసుకువెళతానన్నారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్న సభ్యుల డిమాండ్‌కు నేతలు అంగీకరించలేదు. మరో ఏడాదిలో జడ్పీ కాలపరిమితి ముగుస్తోందని, అప్పటివరకూ అందరూ కలిసి వెళ్లాలని సూచించారు. సభ్యులంతా మాట్లాడినప్పటికీ చైర్‌పర్సన్ మాత్రం మౌనంగా ఉన్నారు. జి.మాడుగుల జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ చైర్‌పర్సన్ పదవి ఇస్తామన్న హామీతోనే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానని గుర్తుచేస్తూ తనకు అన్యాయం జరిగిందన్నారు. ఈ దశలో బొత్స జోక్యం చేసుకుని అధినేతను కలిసి సమస్య విన్నవించుకోవాలన్నారు. ఇదిలావుండగా పార్టీ నేతల వద్ద ఏర్పాటుచేసిన పంచాయితీలో ఏమీ తేలకపోవడంపై పలువురు జడ్పీటీసీ సభ్యులు బయటకు వచ్చి అసంతృప్తి వ్యక్తంచేశారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని కొందరు అన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

రైతుల ఆమోదంతోనే భూ సేకరణ

» సుజల స్రవంతి ప్రాజెక్టుపై ఉగ్గినపాలెం భూ బాధితులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి సమావేశం



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి

కశింకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆమోదంతోనే సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూ సేకరణ జరుగుతుందని సుజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తెలిపారు. శుక్రవారం ఉగ్గినపాలెం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భూ బాధిత రైతులతో మాట్లాడారు. ఎకరా భూమి మార్కెట్ రేటు ప్రకారం 45 లక్షలు వరకు ఉందని, అయితే దీనికి రెండు రెట్లు ప్రభుత్వం అందించేలా కృషి చేస్తామని చెప్పారు. రైతులు మాత్రం మూడు రెట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రైతులకు చెందిన ఎంత భూమి ఉన్నదనే అంశాలపై స్పష్టత లేదని, తమ భూముల వివరాల జాబితాను పూర్తి సర్వే చేసి తెలియజేయాలన్నారు. గతంలో ఉన్న సర్వేకి ఇప్పటికీ భూముల కొలతల్లో వ్యత్యాసాలున్నాయని, వాటిని సరి చేయాలని రైతులు కోరారు. దీనిపై ఆమె స్పందించి సుజల స్రవంతి ప్రాజెక్టు, రెవెన్యూ సర్వేయర్ల ఆధ్వర్యంలో సమగ్రమైన సర్వే జరిపి రైతుల నుంచి ఎంత భూమి తీసుకుంటున్నదన్న విషయాన్ని తెలియజేస్తామన్నారు. ఆ తరువాత రైతులు ఆమోదం మేరకు ధర నిర్ణయించి భూములను తీసుకొని ప్రాజెక్టు నిర్మాణానికి వినియోగిస్తామన్నారు. అనంతరం జిల్లా తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కలగ సోమేశ్వరరావు రైతుల తరఫున మాట్లాడుతూ ధర తమకు అనుకూలంగా ఉంటే భూములను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు కలగ గోవింద, కలగ పార్వతి, కలగ శ్రీను, కరణం వెంకటరమణ, కరణం గోవింద, బలిజ మంగ, బలిజ ముసిలినాయుడు, గొంతిన ఈశ్వరరావు, సేనాపతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో ఎండ్ ప్లాట్‌ఫారం

» 72 మీటర్ల వెడల్పున కారిడార్ (ఎయిర్ కాంకోర్స్) నిర్మాణం

» ప్రయాణికులు ఓవర్ బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం లేకుండా ఏ ప్లాట్‌ఫారంపైకి అయినా వెళ్లేందుకు అవకాశం

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో హౌరా స్టేషన్‌లో మాదిరిగా 'ఎండ్ ప్లాట్‌ఫారం' నిర్మించనున్నామని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. ప్రయాణికులు ఓవర్ బ్రిడ్జి ఎక్కాల్సిన అవసరం లేకుండా దాదాపు 72 మీటర్ల వెడల్పున ఎయిర్ కాంకోర్స్ (కారిడార్) నిర్మిస్తామన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్‌లో ప్రయాణికులు ఒకటో నంబరు ప్లాట్‌ఫారం నుంచి ఇతర ప్లాట్‌ఫారాలకు ఆ కారిడార్‌లో నడుచుకుంటూ వెళ్లిపోవచ్చునన్నారు. దానికి ఇరువైపులా షాపులు, క్యాంటీన్లు, ఇతర వస్తువులు విక్రయించే దుకాణాలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఇక్కడి స్టేషన్‌లో దిగే ప్రయాణికులు భవిష్యత్తులో మెట్రో రైలు కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇదే కారిడార్ (ఎయిర్ కాంకోర్స్) నుంచి ఆ స్టేషన్‌కు వెళ్లే ఏర్పాటు కూడా ఉంటుందన్నారు. దీనికి సంబంధించి మెట్రో ప్రాజెక్టు అధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు.

జీఎం కార్యాలయం కోసం భవనాల పరిశీలన

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం నిర్మాణం ముడసర్లోవలో జరుగుతున్నదని, జనరల్ మేనేజర్ కోసం రెండు, మూడు భవనాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. సిరిపురం వీఎంఆర్‌డీఏకు చెందిన ది డెక్‌లో ఒక అంతస్థు అడిగామన్నారు. అలాగే స్టేషన్‌కు సమీపంలో నిర్మించిన గతి శక్తి భవనాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

జీవో 77ను రద్దు చేయాలి

» పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

» ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణేంద్రకుమార్ డిమాండ్



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్లేట్లుతో భిక్షాటన చేస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. ఫణేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన చేస్తూ ప్లేట్లు పట్టుకొని భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫణేంద్రకుమార్ మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, తల్లికి వందన పథకం పూర్తిస్థాయిలో అర్హులందరికీ అందజేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహం

... 5వ పేజీ తరువాయి

ప్రతినిధులు అర్హత పొందిన రైతు క్షేత్రంలో పరికరాలను అమర్చనున్నారు.

రాయితీతో పరికరాలు

బిందు, తుంపర సేద్యం కింద సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో పరికరాలు అందిస్తుంది. అదే ఎస్సీ, ఎస్టీ రైతులైతే శతశాతం రాయితీ ఇస్తుంది. ఒక రైతుకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల వరకు పరిమితం చేశారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ అందుతుంది. ఐదు ఎకరాల నుంచి 10 ఎకరాల మధ్య సాగుకు 70 శాతం రాయితీ అందుతుంది. ఒక రైతుకు గరిష్ఠంగా రూ.3.10 లక్షలు వరకు పరిమితం చేశారు. పెద్ద రైతులు అంటే 10 ఎకరాలకు పైగా సాగు చేసే రైతుకు 50 శాతం రాయితీపై గరిష్ఠంగా ఒక రైతుకు రూ.4 లక్షలు వరకు పరిమితం చేసి పరికరాలు అందిస్తున్నారు. తుంపర సేద్యం కింద స్ప్రింకర్లను అన్ని వర్గాల చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం రాయితీ అందనుంది.

అర్హులందరికీ రాయితీపై పరికరాలు

బిందు, తుంపర సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. రైతుకు సంబంధించిన భూమి పత్రాలు, ఆధార్, బ్యాంకు, లింకు అయిన ఫోన్ నంబరు, కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఇప్పటికే అన్ని మండలాల్లో పరికరాలు అందించేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి.

- జీవీ లక్ష్మి, జిల్లా అధికారి, ఏపీఎంఐపీ, అనకాపల్లి

ప్రగతి పథంలో జిల్లా

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గాల్లో చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక పార్కులను (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిపాలన పరమైన ఆమోదం తెలిపింది. ఇప్పటికే అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం భూ సమీకరణ పనిలో నిమగ్నమైంది.

ప్రశ్న: పేదరిక నిర్మూలనకు చేపడుతున్న చర్యలు?

జవాబు: విజన్-2047, పి-4 కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా సమర్థంగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. జిల్లాలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో విజన్ డాక్యుమెంట్లు రూపొందిస్తున్నాం. పి-4లో భాగంగా పేదరికంలో ఉన్నవారిని గుర్తించి ప్రైవేటు భాగస్వామ్యంతో సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించి, జిల్లా తలసరి ఆదాయం పెంచేందుకు కృషి జరుగుతోంది. ఇప్పటి వరకు 2,104 బంగారు కుటుంబాలను గుర్తించి దత్తత తీసుకోవడం ద్వారా భరోసా కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రశ్న: వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకున్న చర్యలు?

జవాబు: జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉంచాం. రైతుల ఆర్థిక ఎదుగుదలకు విశాఖ నగరానికి సమీపంలో ఉన్న కె.కోటపాడు, పరవాడ, సబ్బవరం మండలాల్లో విజిటబుల్ క్లస్టర్లుగా, దేవరాపల్లి మండలాన్ని మాంసపు ఉత్పత్తుల కేంద్రంగా అభివృద్ధి చేయాలని డీఆర్‌డీఏ, పశు సంవర్థక శాఖల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా అన్ని మండలాల పరిధిలో పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టాం. జలాశయాల ఆధునికీకరణకు, పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: విద్య, వైద్య పరంగా సాధించిన ప్రగతి ఏమిటి?

జవాబు: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నాం. ఈ ఏడాది కొత్తగా ఇంటర్ విద్యార్థులకు కూడా సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. ఇంటర్, హైస్కూల్ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను పంపిణీ చేశాం. పాఠశాలలు తెరిచే నాటికే మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేశాం. అనకాపల్లిలో త్వరలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానుంది. బుచ్చెయ్యపేట, రాంబిల్లి మండలం పంచదార్లలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం. అచ్యుతాపురంలో కార్మికుల కోసం ఈఎస్ఐ ఆస్పత్రి త్వరలోనే అందుబాటులోకి రానుంది. అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రాంగణంలో క్రిటికల్ కేర్ యూనిట్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేకుండా చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

యాంత్రీకరణతో ఎంతో మేలు

... 5వ పేజీ తరువాయి

శివగణేశ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ కన్నయ్యనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు సుకలరమణమ్మ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ఏడీ శ్రీదేవి, పశుసంవర్థక శాఖ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

» మరో ఇద్దరికి గాయాలు

నక్కపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద గురువారం రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందినట్టు ఎస్ఐ సన్నిబాబు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరానికి చెందిన లారీ డ్రైవర్ మందపాటి ఏసు(46) విశాఖ వస్తూ వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద లారీ ఆపాడు. హోటల్‌కు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, ఇదే సమయంలో అడ్డరోడ్డు నుంచి బైక్‌పై తుని వైపు వెళుతున్న శివరామ్, అమర్‌రాంలు అతనిని ఢీకొన్నారు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న అమర్ రాం , శివరామ్ కూడా గాయపడ్డారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతూ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్ యార్డు నందు శుక్రవారం ఉదయం సుమారు 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి పట్టాలు దాటుతూ రాజమండ్రి నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. అతను నలుపు రంగు షాట్ ధరించి ఉన్నాడని, ఎడమచేతిపై ఎంఆర్ఎస్ట అనే పచ్చబొట్టు, కుడి చేతికి ఎరుపురంగు కాశీతాడు ఉన్నది తప్ప అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామని తెలిపారు. అతని వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్‌లో లేదా సెల్ నంబర్ 94906 19020కి తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. దువ్వాడ -గోపాలపట్నం రైల్వేస్టేషన్‌ల మధ్య శుక్రవారం తెల్లవారుజామున పూరి -తిరుపతి రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి మృతి చెందాడన్నారు. అతని వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, 5.4 అడుగుల ఎత్తు, లైట్ పింక్ కలర్ ఫుల్‌హ్యాండ్ షర్టు, బ్లూ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ప్యాంట్ జేబులో యూనియన్ బ్యాంక్ ఏటీఎం కార్డు ఉందని, చుట్టుపక్కల వెతికినా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఎవరికైనా మృతుని ఆచూకీ తెలిస్తే 73820 58996 ఫోన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లంకెలపాలెం కూడలిలో తప్పిన పెను ప్రమాదం

» ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకు పోయిన ట్రాలర్ లారీ



ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకుపోయిన ట్రాలర్ లారీ

లంకెలపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో పెను ప్రమాదం తప్పింది. ఐరన్ బుల్లెట్లు లోడుతో వస్తున్న ట్రాలర్ లారీ అదుపు తప్పి ఫ్రీలెఫ్ట్ నుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. స్టీల్‌ప్లాంట్ నుంచి ఐరన్ బుల్లెట్లతో ఖమ్మం బయలు దేరిన ట్రాలర్ లారీ లంకెలపాలెం కూడలికి వచ్చేసరికి అదుపు తప్పి పరవాడ వెళ్లే ఫ్రీలెఫ్ట్ రోడ్డులోకి దూసుకొచ్చింది. రహదారి మధ్యలో గల సిమెంట్ దిమ్మలను ఢీకొని రహదారి పక్కన గల డ్రైనేజీలోకి దిగి నిలిచింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ట్రాలర్ లారీ ముందు భాగం దెబ్బతింది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ప్రమాదం జరిగిన సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పరవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో ట్రాలర్‌ను తొలగించారు. ఈ మేరకు పరవాడ సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

సబ్బవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాలికను అపహరించిన ఘటనలో స్థానిక పోలీసులు ఓ యువకుడిని పోక్సో కేసులో అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడారిసింగ్ గ్రామానికి చెందిన పసుపులేటి హరిబాబు కుటుంబ సభ్యులతో అసకపల్లిలో ఉంటూ సమీపంలో నర్సరీ నడుపుతున్నాడు. అతనికి తేజ(19) అనే కుమారుడు ఉన్నాడు. గత మే నెలలో ఆ యువకుడు సబ్బవరానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశాడు. దీనిపై బాలిక తండ్రి మే 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రంలో గురువారం సాయంత్రం తేజను పట్టుకొని అరెస్టు చేశారు. అతనితో పాటు ఉన్న బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అరెస్టు చేసిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

పేకాట శిబిరంపై దాడి

నక్కపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామం సమీపంలో పేకాట శిబిరం వుందనే సమాచారంతో గురువారం అర్ధరాత్రి తమ సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నామని సీఐ కె.కుమారస్వామి స్థానిక విలేకరులకు చెప్పారు. 11 మంది జూదరులను పట్టుకుని వారి నుంచి రూ1.23,385లు నగదు, 7 బైక్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. కొబ్బరితోటలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం కొనసాగుతుందన్న సమాచారం మేరకు ఈ దాడులు చేశామని సీఐ చెప్పారు.